

చెట్లు, తుప్పలతో..



వృక్షాలు, తుప్పలతో భయంకరంగా ఉన్న మహిళాపార్కు



నిరుపయోగంగా ఆటవస్తువులు

ఆహ్లాదం కనుమరుగు!

- కళావిహీనంగా తోకాడ పార్కులు
- అధికారుల తీరుపై ప్రజల అసంతృప్తి

అక్కిరెడ్డిపాలెం: పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజలకు ఆహ్లాదం పంచే పార్కులు కళావిహీనంగా మారాయి. పిచ్చి మొక్కలు.. చెత్తాచెదారంతో నిండిపోయాయి.అడుగు పెట్టలేని విధంగా ఉన్నాయి. ఫలితంగా ఉదయం, సాయంత్రం సమయంలో సేదతీరుదామంటే చోటు కరువైంది. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా జీవీఎంసీ 71వ వార్డు తోకాడలో విశాలమైన రెండు పార్కులు ప్రజలకు దూరమయ్యాయి.

ఇదీ పరిస్థితి

కాంక్రీట్ జంగిల్‌గా మారిన నేపథ్యంలో ప్రజలకు ఆహ్లాదం కరువైంది. అక్కడక్కడ ఉన్న పార్కులే సేదతీరడానికి దిక్కుగా ఉన్నాయి. అలాంటిది తోకాడలో నందన వనం అనే పేరుతో ఉన్న పార్కు నిర్వహణ లేక అలంకార ప్రాయంగా ఉంది. తోకాడ



మూతపడిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే వేదిక

పార్కులో చిన్నపిల్లల ఆటవస్తువులు తుప్పుపట్టాయి. బ్యాలెన్స్ గేమ్స్, జారుడు బల్ల, చిల్డ్రన్స్ జెయింట్ వీల్ నిరుపయోగంగా మారాయి. పార్కులో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర కల్చరల్ ఈవెంట్లు నిర్వహించుకునేందుకు ఏర్పాటు చేసిన స్టేజ్ మూతపడింది. పార్కులో తుప్పలు మొలిచి పాములు, విషకీటకాలకు నిలయంగా మారింది. దీంతో సందర్శకులు అడుగు



అలంకారప్రాయంగా తోకాడలోని నందన వనం పార్కు

పెట్టలేని పరిస్థితి ఏర్పడింది.

తుప్పలతో నిర్వీర్యం

నందన వనం పార్కు సమీపంలోని లేడీస్ పార్కు పరిస్థితి దయనీయంగా మారింది. ఈ పార్కు గేటుకు తాళం అలంకారప్రాయంగా ఉంది. పార్కు చుట్టూ ఫెన్సింగ్, మూడడగుల మేర గోడ, గేట్లు వేసినా ఫలితం శూన్యం అంటున్నారు. నిర్వహణ లేక పాములు సంచరిస్తున్నాయని ఆరోపిస్తున్నారు. ప్రజా ధనాన్ని వెచ్చించి సకల సౌకర్యాలతో నిర్మించి పార్కులను వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.



పార్కులో తుప్పు పట్టిన ఊయల

నేడు గాజువాకలో సీఐటీయూ మహా ధర్నా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం గాజువాకలో మహాధర్నా నిర్వహించనున్నారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించాలని, ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలని, స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ఆపాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలన్న డిమాండ్లపై ధర్నా చేస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్న ధర్నాలో ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసితులు తమ కుటుంబ సభ్యులతో పాల్గొవాలని యూనియన్ గౌరవాధ్యక్షులు జె. అయోధ్యరామ్, ప్రధానకార్యదర్శి యు. రామస్వామి కోరారు.

టీకాలతో శిశువులకు రక్షణ

అక్కిరెడ్డిపాలెం: టీకాలు శిశువుల ప్రాణాలకు రక్షణ అని షీలానగర్‌లో కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి కడల్స్ విభాగం సీనియర్ కన్సల్టెషన్ పీడియాట్రిషన్ డాక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి అన్నారు. టీకాల ఆవశ్యకతపై శనివారం ఆస్పత్రిలో నిర్వహించిన అవగాహన కార్యక్రంలో ఆయన మాట్లాడారు. 60 సంవత్సరాల్లో ప్రపంచ వ్యాప్తంగా చేపట్టిన టీకా కార్యక్రమాలు అనేక వ్యాధులను నివారించడంలో సహకరించాయన్నారు. టీకాలు మనశరీరంలో వ్యాధినిరోధక శక్తిని అభివృద్ధి చేయడంలో సహాయపడతాయని చెప్పారు. వ్యాధులను ఎదుర్కొవడం కన్నా టీకాల ద్వారా వ్యాధినిరోధకాలను అభివృద్ధి చేసుకోవడం మరింత సురక్షితమైన మార్గమని డాక్టర్ మనోజ్ కుమార్‌రెడ్డి అన్నారు. టీకాల ద్వారానే పోలియో వంటి వ్యాధులకు చెక్ పెట్టినట్లు వివరించారు. చిన్నారులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని కోరారు.

క్లుప్తంగా

అన్నప్రసాదాలకు విరాళాల అందజేత



పూజలు చేస్తున్న దాతలు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో అన్నప్రసాదాలకు భక్తులు విరివిగా విరాళాలు అందజేస్తున్నారు. శనివారం దివ్యక్షేత్రంలో వేంకటేశ్వరకాలనీకు చెందిన నంబారు రమణ, ఝాన్సీ రూ.20 వేలు ట్రస్ట్ ప్రతినిధులకు అందజేశారు.

- వెంకోజీపాలేనికి చెందిన సీహెచ్ ఎం.రాజు, విజయలక్ష్మి దంపతులు శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో నిర్వహిస్తున్న శ్రీవారి అన్నప్రసాదాలకు రూ.10 వేలు ఇచ్చారు. పూజల్లో పాల్గొన్నారు.

పేదలకు వస్త్రాల పంపిణీ



పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న మహిళా ప్రతినిధులు

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. సత్యసాయి బాబా 99వ జయంతి సందర్భంగా సత్యసాయి మహిళా విభాగం ప్రతినిధులు పేదలకు వస్త్రాలు, దుప్పట్లు అందజేశారు. అదే విధంగా పరిసర ప్రాంతాలకు చెందిన 175 పేద కుటుంబాలకు చీర, దుప్పటి, లుంగీ, ఆహార ప్యాకెట్లు, మజ్జిగ ఇచ్చారు.కార్యక్రమంలో సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు పి.ఆర్.ఎస్.ఎన్. నాయుడు, సీనియర్ పదాధికారులు డి. రాఘవరావు, ఆర్.ఎ. నాయుడు, ఈశ్వరి, సోమేశ్వరి, జి. రామకృష్ణ, ఎ.వి. శ్రీనివాస్, జి.వి. ప్రసాద్, పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



ఓటరు నమోదు కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది

అగనంపూడి: ఓటరు నమోదు, మార్పులు చేర్పుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను సద్వినియోగపర్చుకోవాలని తహసీల్దార్ శ్రీవల్లి కోరారు. అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం కూడా ఓటరు నమోదు కేంద్రాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. అలాగే రెండో విడత ఈనెల 23, 24 తేదీల్లో కూడా శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, చిరునామాలు మార్పులు, అభ్యంతరాలు, తొలగింపుల కోసం శిబిరాలను వినియోగించుకోవాలని కోరారు.

ఇద్దరు విద్యార్థినులకు నేవీ ఉద్యోగాలు



పి.స్నేహిత



ఎం.తార్న

గాజువాక: ఇండియన్ నేవీలో ఉద్యోగాలకు స్థానిక విశాఖ డిఫెన్స్ అకాడమీకి చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారు. దేశ రక్షణ రంగంలో బాలికలకు కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది నుంచి ఉద్యోగావకాశాలు కల్పించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల్లో గాజువాకకు చెందిన పి.స్నేహిత, ఎం.తార్న ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ కె.సీతాలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం వారిని అభినందించారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు పరిధి షీలానగర్ వేంకటేశ్వరకాలనీలో గవర గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీ గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, 68వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్‌లు శ్రీ గౌరీ పరమేశ్వరులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సేవా సంఘం నాయకులు మళ్ల కుమార్, సేవా సంఘం అధ్యక్షుడు పెంటకోట ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షుడు మద్దాల శ్రీనివాసరావు, ప్రతినిధులు శరణం రామచంద్రరావు, చదరం శంకర్, దాడి సుబ్రమణ్యం, ఆర్డర్ వీరభద్రరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పెట్ల అప్పారావు, బోనెల జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీ గౌరీ పరమేశ్వరులను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తదితరులు

ఓటరు నమోదుకు దరఖాస్తుల స్వీకరణ

గాజువాక: ఓటర్ల నమోదుకు అధికారులు శనివారం ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించారు. గాజువాక నియోజకవర్గంలోని 309 పోలింగ్ కేంద్రాల్లో సంబంధిత బీఎల్వోలు దరఖాస్తులు స్వీకరించారు. కొత్తగా ఓటు నమోదు చేసుకోవడంతోపాటు ఓటరు కార్డుల్లో తప్పులను సరి చేసుకోవడం, ఓటును తమకు నచ్చిన పోలింగ్ కేంద్రానికి బదిలీ చేసుకోవడం, డబుల్ ఎంట్రీలు, మరణించినవారి ఓట్లను తొలగించడం తదితర సేవలకు ఈ సందర్భంగా దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ టి.శ్రీవల్లి పలు పోలింగ్ కేంద్రాల్లో పర్యవేక్షించారు. ఈ కార్యక్రమం ఆదివారం కూడా కొనసాగుతుందని ఆమె తెలిపారు.



పోలింగ్ కేంద్రంలో జాబితాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీవల్లి

300 మందికి కంటి వైద్య పరీక్షలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 73వ వార్డు పరిధి వుడా కాలనీలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో శనివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వేద్ నేత్రాలయ సూపర్ స్పెషాల్టీ ఐ కేర్ ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన శిబిరంలో 300 మందికి డాక్టర్ పంకజ్ డోంగ్రే, డాక్టర్ బెల్లాల కీర్తి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మొగలపల్లి త్రిమూర్తులు, బెల్లాల సతీష్‌కుమార్ పాల్గొన్నారు.



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ పంకజ్

డెబ్రిస్ తొలగించారు

సాక్షి ఎఫెక్ట్..

పెదగంట్యాడ: డంపింగ్ యార్డా..రోడ్డా! శీర్షికతో గత నెల 30న 'సాక్షి' దినపత్రికలో ప్రచురించిన కథనానికి ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్ స్పందించారు.వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ సిబ్బందితో కలసి శుభ్రం చేయించారు. జీవీఎంసీ 64వ వార్డు పరిధిలోని యాతపాలెం వెళ్లే ప్రధాన రహదారి డంపింగ్ యార్డ్‌ను తలపించే విధంగా మారింది. ఎక్కడెక్కడి నుంచో డెబ్రిస్ తీసుకువచ్చి ఈ రోడ్డు పక్కన డంప్ చేస్తున్నారు. దీంతో రోడ్డు మొత్తం డెబ్రిస్, మట్టితో నిండిపోయింది. గుట్టలు గుట్టలుగా డెబ్రిస్ పేరుకుపోతున్నా.. అడ్డుకునే నాథుడే కరువయ్యాడని ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించి డెబ్రిస్‌ను తొలగించి శుభ్రం చేశారు.దీంతో 'సాక్షి' దినపత్రికకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.



డెబ్రిస్ తొలగింపును పర్యవేక్షిస్తున్న ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి



సేవ్ వైజాగ్ స్టీల్ పోస్టర్ ప్రదర్శిస్తున్న ఉక్కు ఉద్యోగుల కుటుంబ సభ్యులు

ఉక్కునగరం: సకాలంలోఒ జీతాలు ఇచ్చి తమ కుటుంబాలను కాపాడాలని స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల కుటుంబీకులు (భార్య, పిల్లలు) యాజమాన్యాన్ని కోరారు. శనివారం సాయంత్రం ఉద్యోగుల కుటుంబీలు ఉక్కునగరం కూడలి వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు వెంటనే జీతాలు చెల్లించాలని నినాదాలు చేశారు. మహిళలు మాట్లాడుతూ ఉద్యోగులకు గత నెలలో సగం జీతం ఇప్పటి వరకు చెల్లించలేదన్నారు. ఈ నెల కూడా ఇంత వరకు జీతం విషయం తేల్చలేదన్నారు. జీతాలు చెల్లించకపోవడం వల్ల తమ కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. పిల్లల చదువు, కుటుంబ నిర్వహణ భార మవుతుందని వాపోయారు. దీనికి తోడు రుణాలకు డిఫాల్టర్లుగా మారుతున్నామని ఆవేదన వెలిబుచ్చారు. యాజమాన్యం ఉద్యోగుల ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని వెంటనే జీతాలు చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఉక్కునగరంలో కరెంటు చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్



నెట్‌బాల్ పోటీల్లో హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు

అగనంపూడి : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) 68వ రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలు శనివారం గాజువాక మండలం కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అండర్-14 బాలురు, బాలికల విభాగాల్లో మూడు రోజుల పాటు నిర్వహిరచనున్న ఈ పోటీల్లో 13 ఉమ్మడి జిల్లాల నుంచి 350 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ట్రోఫీలను ప్రదర్శించారు. కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా విద్యాశాఖాధికారి సీహెచ్.రవీంద్రబాబు, కార్పొరేటర్ బొండా జగన్, పాఠశాల హెచ్‌ఎం సూర్యప్రకాశరావు, ఎంఈవో సునీత, ఫిజికల్ డైరెక్టర్లు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దేముడు, పీఈటీల అసోసియేషన్ కార్యదర్శి లలిత్‌కుమార్ పాల్గొన్నారు.



టోర్నమెంట్ ట్రోఫీలను ప్రదర్శిస్తున్న అధికారులు,నిర్వాహకులు



పోటాపోటీగా తలపడుతున్న క్రీడాకారులు

బెల్ట్ షాపు నిర్వహిస్తున్న జనసేన నాయకుడి అరెస్ట్

79 మద్యం సీసాలు, నగదు స్వాధీనం



పోలీసుల అదుపులో జనసేన నాయకుడు అప్పారావు(తెలుపు చొక్కా)

అక్కిరెడ్డిపాలెం: బెల్ట్ షాపు నిర్వహిస్తున్న జనసేన నాయకుడిని గాజువాక పోలీసులు శనివారం అరెస్ట్ చేసి, అతని నుంచి మద్యం బాటిళ్లు, నగదు, ఒక బుల్లెట్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. గాజువాక ఎస్‌ఐ టి.రవికుమార్ తెలిపిన వివరాలివీ.. షీలానగర్‌లోని కుంచమాంబ ఆలయం వద్ద ఉన్న ఒక షాపులో జగ్గయ్యపాలేనికి చెందిన జనసేన నాయకుడు బుదిరెడ్డి అప్పారావు బెల్ట్ షాపు నిర్వహిస్తున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఎస్‌ఐ టి.రవికుమార్, సిబ్బందితో కలిసి బెల్ట్ షాపుపై దాడి చేశారు. 79 క్వార్టర్ బాటిళ్లు, రూ.5,060 నగదు, బుల్లెట్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అప్పారావు పందుల పెంపకం చేపడుతుంటారు. అందరూ ఆయన్ని పందుల అప్పారావుగా పిలుస్తుంటారని, అతనిపై అనేక రకాల ఆరోపణలున్నాయని స్థానికులు చెప్పారు.

మార్మోగిన గోవింద నామస్మరణ

- వెంకన్న ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- శ్రవణనక్షత్రం కావడంతో రద్దీ



నడుపూరు మహిళల గానామృతం



బారులు తీరిన భక్తులు

పెదగంట్యాడ: శ్రవణనక్షత్రం(స్వామి వారి జన్మ నక్షత్రం రోజు) సందర్భంగా మండలంలోని వేంకటేశ్వర స్వామి ఆలయాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. జీవీఎంసీ 73వ వార్డు వుడాకాలనీ మామిడి తోటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం తెల్లవారుజాము నుంచి స్వామివారికి పంచామృత అభిషేకాలు, అంకురార్పణ చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, తులసి అర్చనలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

- జీవీఎంసీ 65వ వార్డు వాంబేకాలనీలో గరుడాద్రిపై వేంచేసియున్న నీలాసమేత వైకుంఠ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం అన్న సమారాధన ఏర్పాటు చేశారు.
- జీవీఎంసీ 76వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని పూజలు చేశారు.నడుపూరుకు చెందిన మహిళలు గానామృతంతో అలరించారు.



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి

ప్రజలతో స్నేహ పూర్వకంగా మెలగండి

- హార్బర్ ఏసీపీ కాళిదాసు

పెదగంట్యాడ: స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా మెలగాలని హార్బర్ ఏసీపీ కాళిదాసు సూచించారు. ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన శనివారం సాయంత్రం న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. కేసుల పురోగతిపై ఆరా తీశారు. సిబ్బంది పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో స్నేహ పూర్వకంగా మెలగాలని, వారికి సత్వర న్యాయం అందేలా చూడాలని సీఐకు సూచించారు. పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారు ఎవరైనా సరే చర్యలు తీసుకోవాలన్నారు.



సీఐకు సూచనలిస్తున్న హార్బర్ ఏసీపీ కాళిదాసు

పోగొట్టుకున్న నల్లపూసల దండ అందజేత

అక్కిరెడ్డిపాలెం: నాగులచవితి రోజు పోగొట్టుకున్న బంగారు నల్లపూసల దండను శనివారం గాజువాక క్రైం పోలీసులు బాధితురాలికి అందజేశారు. గాజువాక క్రైం సీఐ కె.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.. 69వ వార్డు నాతయ్యపాలెంలో నివాసం ఉంటున్న నెక్కిన దుర్గ నాగులచవితి రోజు సమీపంలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో ఆమె ధరించిన మూడున్నర తులాల నల్లపూసల దండ ఎక్కడో పడిపోయింది. ఆమె భర్త ఉమామహేశ్వరరావుతో కలిసి గాజువాక క్రైం పోలీసులకు సమాచారం అందించారు.కాగా శనివారం ఇంటి ఆవరణలోపోయిన నల్లపూసలదండ కనబడటంతో విషయాన్ని గాజువాక క్రైం పోలీసులకు ఉమామహేశ్వరరావు సమాచారం అందించాడు. దీంతో క్రైం కానిస్టేబుల్ సీతారామయ్య వస్తువును తిరిగి బాధితురాలికి అందజేశారు.



నల్లపూసల దండ అందజేస్తున్న క్రైం కానిస్టేబుల్ సీతారామయ్య